## టి. శ్రీవల్లి రాధిక



# కథ

**“చూడటానికలా వుంటుంది కానీ అమ్మో! నెరజాణండీ అది!” అన్న సరోజ మాటలు మరోసారి గుర్తొచ్చాయి ఆ అమ్మాయిని చూస్తుంటే.**

ఆరోగ్యంగా కళగా వున్న మొహం. ఆ మొహంలో ఏదో అర్థంకాని భావం. దిగులా! భయమా! అసహ్యమా! నిర్వేదమా!

ఈ మహిళా సంరక్షణ కేంద్రం అయిదేళ్ళుగా నడుపుతున్నాను నేను. ఈ వూరేకాక చుట్టుప్రక్కల పల్లెటూర్ల నుంచి కూడా ఎందరో ఆడవాళ్ళు వస్తూంటారిక్కడికి. రకరకాల సమస్యలతో వచ్చిన ఆడవాళ్ళని చూశాను నేను. తమకి అన్యాయం చేసిన వాళ్ళపై దుమ్మెత్తి పోసే వాళ్ళనీ...శాపనార్థాలు పెట్టేవాళ్ళనీ, ఏడ్చి పెడబొబ్బలు పెట్టేవాళ్ళనీ...ఆపకుండా రాగాలు తీసేవాళ్ళనీ.

ఒక్కొక్కసారి నవ్వుతూనే తమ కష్టాలని విప్పిచెప్పే వాళ్ళనీ, సమస్యని ఎంత నవ్వులాటగా తీసుకున్నా పరిష్కారంమాత్రం దొరికే తీరాలని పట్టుబట్టే వాళ్ళనీ..అందరినీ చూశాను.

కానీ ఈ అమ్మాయి వాళ్ళందరికీ భిన్నంగా వుంది. అసలు ఈమె మనసులో భావమేమిటో అర్థంకానంత గంభీరంగా వుంది. ఇదేనా జాణతనమంటే!

సత్యవతి తీసుకొచ్చింది ఈ పిల్లని నా దగ్గరికి. ఆ అమ్మాయిని కుర్చీలో కూర్చోబెట్టి తన కథంతా చెప్పింది. చాలా పాత కథే.

పేరు మల్లీశ్వరి. ఎప్పుడూ ఏదో ఒక పనిచేస్తూ చలాకీగా వుండే మల్లీశ్వరి అంటే వూర్లో తెలీని వాళ్ళు లేరు. చదివిస్తే చాలా గొప్ప మనిషయిపోయేది కానీ చదివించే శక్తి వాళ్ళ నాన్నకి లేదు. ఇక్కడికి దగ్గర్లో వున్న చిన్నపల్లెటూరు వాళ్ళది.

వాళ్ళ వూర్లో రంగారావుగారు ఓ మోస్తరు స్థితిపరుడు. ఆయన కొడుకు ప్రసాద్ ఇంజినీరింగ్ చదువుతున్నాడు. ప్రసాద్‌కి మల్లీశ్వరి నచ్చింది. మల్లీశ్వరికీ ప్రసాద్ నచ్చాడు. చదువయిపోయాక నిన్ను పెళ్ళి చేసుకుంటానన్నాడతను. మురిపించే కబుర్లు చెప్పాడు. ఆమె అభ్యంతరం చెప్పకపోవడంతో ఇంకా ముందుకే వెళ్ళాడు.

వీళ్ళిద్దరి వ్యవహారం వూర్లో చాలామందికి అర్థమయింది. ఒక ఏడాదిపాటు ఇలా సాగాక రెండు నెలల్లో ప్రసాద్ చదువయిపోతుందనీ ఆ తర్వాత అతని మేనమామ కూతురితో అతనికి పెళ్ళవుతుందనీ మల్లికి తెల్సింది.

ప్రసాద్‌ని నిలదీసింది. “నీతో నాకు పెళ్ళా” అంటూ అతను నవ్వాడు. అతనే కాదు వూర్లో వాళ్ళందరూ కూడా నవ్వారు ఆమె అత్యాశకి.

“జరిగిందేదో జరిగింది. ఇంక నోర్మూసుకో”మన్నదే అందరూ ఆమెకి ఇచ్చిన సలహా. “పెళ్ళి జరగాల్సిందే” అనేది ఆమె సమాధానం.

ఆమె మొండితనానికి వూర్లో ఎక్కువమంది తిట్టిపోసినా...ఒకళ్ళిద్దరు మాత్రం ఆమెకి కాస్త సానుభూతి చూపించారు. వాళ్ళలో సత్యవతి ఒకతె.

అయితే సత్యవతి కూడా మల్లీశ్వరిని పూర్తిగా సమర్థించదు. ప్రసాద్ పెళ్ళి చేసుకోవడమనేది జరుగుతుందనీ అనుకోదు. ఏం కావాలో ఏం చేయాలో స్పష్టంగా తెలీకపోయినా మల్లీశ్వరి బాధపడుతోంది కాబట్టీ బాధపడే ఆడవాళ్ళు నా దగ్గరికి వస్తూంటారు కాబట్టీ మల్లీశ్వరినీ తీసుకొచ్చింది. “ఏం చేయాలో చెప్పండమ్మగారూ!” అంది.

మల్లీశ్వరికి మాత్రం తనకేం కావాలో స్పష్టంగా తెలుసు. “నన్ను అతను పెళ్ళి చేసుకుంటానన్నాడు. అందుకే నేను అతనేం చేసినా ఒప్పుకున్నాను. కాబట్టి ఇప్పుడు పెళ్ళి చేసుకోవాల్సిందే” అని స్పష్టంగా చెప్పింది.

“ఆయనెందుకు చేసుకుంటాడు చేసుకోడు” అని ఆమె యింట్లోవాళ్ళే తేల్చేశారు.

“నిన్ను చేసుకుంటే ఆ బాబుని వాళ్ళ నాన్న యింట్లోనుంచి వెళ్ళగొడతాడే. పైసా యియ్యడు” అన్నాడు మల్లివాళ్ల నాన్న.

“ఇయ్యకపోతే ఇయ్యకపోయాడు. ఆయన్నైతే పెళ్ళి చేసుకోమను” అంది మల్లి. “నాకు డబ్బులక్కరలేదు. ఆయన చదువు చూసి యిష్టపడ్డా. అది చాలు” అంది.

“బడి మొహమే ఎరగని దరిద్రపుదానా! నీకు అంత చదువుకున్నోడు కావాల్సొచ్చాడంటే!” అని అందరూ ఛీత్కరించారు.

రెండురోజుల క్రితం ఇదంతా చెప్పి వెళ్ళారు సత్యవతీ, మల్లీశ్వరీ. నిన్న మళ్ళీ వచ్చారట కానీ అప్పుడు నేను మరో పనిమీద బయటికి వెళ్ళాను.

నిన్న సరోజ మాట్లాడింది ఆ అమ్మాయితో. నేను లేనప్పుడు ఆఫీసు వ్యవహారాలన్నీ సరోజే చూసుకుంటుంది.

ఎవరి సపోర్టూ లేదని అర్థమయింది కాబట్టి సరోజ ఆమెకి నచ్చచెప్పేందుకు ప్రయత్నించినట్లుంది. అసలు ముందు వాళ్ళ నాన్నే “ఏ.. ఇక చాలు వూర్కో” అని కసురుతున్నాడు. అందుకే సరోజ కూడా ఇదంతా జరిగేపని కాదన్నట్లుగా మాట్లాడినట్లుంది.

“ఎంత చెప్పినా ఒప్పుకోలేదండీ. ఆయన పెళ్ళి చేసుకుంటానన్నాడు కాబట్టి చేసుకోవల్సిందే.. అని మొండికేసి కూర్చుంది” అని చెప్పింది సరోజ నిన్న నేను రాగానే.

“పెళ్ళి చేసుకుంటానంటే మాత్రం నీ బుద్ధేమయింది అని అడిగేద్దామనుకున్నా” అని కూడా అంది. నాకర్థమయింది. సరోజకి ఆమెపట్ల సానుభూతి లేదు. సమితి కార్యకర్తలందరూ కూడా తలోరకంగా మాట్లాడుతున్నారు. ఎవరూ దీనిని పూర్తిగా అన్యాయమనరు. అలాగని ప్రసాద్‌నీ సమర్థించరు.

ఆ విషయాన్ని పట్టించుకోకుండా నా పని నేను మొదలుపెట్టాను. ఒక పదిమంది కార్యకర్తలతో కలిసి ప్రసాద్ యింటి దగ్గరకెళ్ళి వాళ్ళతో మాట్లాడే ప్రయత్నం చేశాను. మీడియాకి చెప్పాం.

ప్రసాద్‌ని చూసి నేను ఆశ్చర్యపోయాను. ఇంజినీరింగ్ చదివే కుర్రాడంటే నాజూగ్గా వూహించుకున్నాను నేను. మా అబ్బాయి కూడా ఇంజినీరింగ్ ఫైనలియర్ చదువుతున్నాడు. కానీ ప్రసాద్ మా కిరణ్‌లా లేదు. పొడుగ్గా లావుగా చాలా మొరటుగా వున్నాడు. మల్లీశ్వరి కంటే ఏ పదేళ్ళో పెద్దవాడేమో అనిపించేలా వున్నాడు.

“ఏం చూసి ఎంచుకుంది మల్లీశ్వరి వీడిని భర్తగా!” అనిపించింది. నిజంగా చదువు చూసినా, వాడి ఆస్తి వాడి వంటిమీద కనిపిస్తోంది. కానీ వాడి చదువు వాడి మొహంలో కనిపించడం లేదు. ఆ విషయం మల్లీశ్వరికి అర్థమవలేదా!

వార్త మీడియాకి చేరింది కాబట్టి విపరీతంగా ప్రచారం వచ్చింది కానీ వెనక నిలబడి పరిష్కారం కనుక్కునే బాధ్యత మాత్రం మల్లీశ్వరి నా మీదే పెట్టింది.

ఏం చేయాలా ఎవరి మధ్యవర్తిత్వంతో విషయాన్ని సెటిల్ చేయచ్చా అని నేను ఆలోచిస్తూండగా వచ్చాడు కిషోర్, “ఆంటీ మీకో విషయం చెప్పాలి” అంటూ. మా కిరణ్ క్లాస్మేట్ వాడు.

నన్ను కూర్చోబెట్టి పెద్దమనిషిలా గంభీరంగా చెప్పాడు. “కిరణ్, బిందు లవ్ చేసుకుంటున్నారాంటీ, పెళ్ళి చేసుకుందామనుకుంటున్నారు”

## ఎంపిక





"ఏమిటీ!"
అన్నాను నేను అదిరిపడుతూ.

"అవును. ఎగ్జామ్స్ అయ్యాక మీకు చెప్పాలనుకుంటున్నారు. ఇద్దరికీ క్యాంపస్ ఇంటర్వ్యూలో జాబ్స్ వచ్చాయి కదా! అందుకే ఎగ్జామ్స్ అవగానే పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నారు"

వాడు తాపీగా చెప్పి వెళ్ళిపోయాడు కానీ నేను స్థాణువులా కూర్చుండిపోయాను. వాడు నిజం చెప్పాడా జోక్ చేసి వెళ్ళాడా అనిపించింది. కానీ జోక్ ఎందుకు చేస్తాడు యిలాంటి విషయంలో.

కానీ కిరణ్ మాత్రం ఇంత పెద్దవిషయం నా దగ్గర దాచిపెడతాడా! ఒక్కడే కొడుకవడం వల్లనేమో వాడితో నాకు అనుబంధం ఎక్కువే. ఇప్పటికీ వాడు కాలేజ్‌లో జరిగే ప్రతి విషయమూ నాతో చెప్తాడు. నేనూ నా కార్యక్రమాలన్నీ వాడితో చర్చిస్తాను.

రాత్రిపూట నేను నా పనులు పూర్తిచేసుకుని నడుము వాల్చగానే నా దగ్గరికి వచ్చి కూర్చుంటాడు. రోజూ ఓ అరగంటయినా నాతో కబుర్లు చెప్తాడు.

వాడి స్నేహితులందరి పేర్లూ, లక్షణాలూ - అన్నీ తెలుసు నాకు. ఈ బిందు అనే పిల్ల కూడా తెలుసు. వాడితో కొంచెం చనువుగానే వుంటుంది.

ఆ అమ్మాయి గుర్తురాగానే నా మొహం చిరాకుతో ముడుచుకుంది. తామసంగా తన ఒళ్ళే తనకి బరువన్నట్లుగా వుంటుంది. ఒళ్ళంతా కదిలేలా నవ్వడం. మగపిల్లలపై పడిపోతూ మాట్లాడటం. నాకు నచ్చని వెకిలితనాలు చాలా వున్నాయి ఆ అమ్మాయికి. అలాంటి పిల్లని కిరణ్‌కి భార్యగా నేనెప్పటికీ ఒప్పుకోలేను.

కిరణ్ వచ్చాడు. కిషోర్ వచ్చిన విషయం చెప్పకుండా ఇంకేదేదో డొంకతిరుగుడుగా మాట్లాడి చివరికి ఈ ప్రశ్న వేశాను.

"అవునమ్మా! బిందు అంటే నాకిష్టం. పెళ్ళి చేసుకుంటాను" అన్నాడు వాడు తడుముకోకుండా.

ఆ నిర్ణయంమీద ఎంత గట్టిగా నిలబడతాడో వాడు ఆ మాట చెప్పిన ధోరణిలోనే అర్థమయింది.

'ఇదెక్కడి గోల తెచ్చిపెట్టావురా భగవంతుడా!' అనుకున్నాను. మల్లీశ్వరి సమస్య వెనక్కి వెళ్ళింది. నా సమస్య భూతమై ముందుకొచ్చింది.

మా వారితో చర్చించాను. ఆయన మా బావగారినీ తోటికోడళ్నీ పిలిపించారు. వాళ్ళూ మాట్లాడారు.

తన నిర్ణయం మరోసారి స్పష్టంగా చెప్పి, ఒక్క మాట ఎక్కువ మాట్లాడకుండా, అసలన్ని మాటలు మాట్లాడాల్సిన అవసరం తనకి లేదన్నట్లుగా బయటికి వెళ్ళిపోయాడు కిరణ్.

"ఆ పిల్ల ఎవరోగానీ బానే వల్లో వేసుకుంది వీడిని" అంది మా తోటికోడలు.

"అసలు వీడింత త్వరగా పెళ్ళి ఆలోచన చేస్తాడని నేననుకోలేదు" అన్నారు మావారు విస్మయంగా.

"అవును. నేనూ అనుకోలేదు. నా వళ్ళో పడుకుని 'అమ్మా, అమ్మా' అంటూ గారాబాలు పోయేవాడు. నేను నోట్లో ముద్దలు పెడితేనే అన్నం తింటానంటూ మారాం చేసేవాడు. ఇంత త్వరగా పెళ్ళి అంటాడని నేనూ

అనుకోలేదు"

"ఈ రోజుల్లో ఆడపిల్లలు ఎలా వున్నారు - అంది మా తోడికోడలు. కాస్త డబ్బున్నవాడు కనబడితే వదిలిపెట్టడం లేదు. అమ్మాయిలకంటే అబ్బాయిలని జాగ్రత్తగా చూసుకోవలసిన పరిస్థితి వచ్చింది"

ఆవిడకి యిద్దరు మగపిల్లలు. ఆ అతిశయమూ, ఆడపిల్లల మీద చులకనభావమూ ఆవిడ మాటల్లో ఎప్పుడూ వినిపించే విషయాలే.

అరగంట చర్చ తర్వాత అందరూ ఎవరిదోవన వాళ్ళు వెళ్ళారు. నేనొక్కదాన్నే మిగిలాను యింట్లో. సమితి ఆఫీస్‌కి వెళ్ళాలనిపించలేదు. సరోజకి ఫోన్ చేసి "ఒంట్లో బాగాలేదు. నువ్వు చూసుకో" అని చెప్పాను.

టి.వి.ముందు కూర్చుని ఆలోచనలలో పడ్డాను. కిరణ్ వచ్చాక మెల్లిగా సర్ది చెప్పాలి. సాధకబాధకాలన్నీ వివరిస్తే తెలుసుకోకపోడు. ఆ అమ్మాయి నాకు నచ్చలేదంటే అర్థం చేసుకోకపోడు.

నన్ను నేనే సమాధానపరుచుకుంటూ నాకు నేనే ధైర్యం చెప్పుకుంటూండంగా ఫోన్ మ్రోగింది.

"అత్తయ్యా! కిరణ్ నేనూ బయటికి వెళ్తున్నాం. మా ప్రాజెక్ట్ గైడ్ వాళ్ళింటికి. కిరణ్ సెల్ పనిచేయడం లేదు. అందుకని నా సెల్ నుంచి చేస్తున్నాను. కొంచెం లేట్‌గా వస్తానని చెప్పమన్నాడు కిరణ్"

ప్రవాహంలా వినపడుతున్న మాటలకి అడ్డంపడి "ఎవరు మాట్లాడేది!" అన్నాను నేను అయోమయంగా.

"నేనత్తయ్యా. బిందుని"

'నాకు వంట్లోనుంచి ఒక్కసారిగా వేడిసెగ పైకి లేచినట్లనిపించింది. ఎంత ధైర్యం ఈ పిల్లకి. నిన్నటిదాకా ఆంటీ అని పిల్చేది. ఇవాళ అత్తయ్యా అనుకుంటూ ఎంత దర్పంగా మాట్లాడుతోంది!'

"అత్తయ్యా! అంటున్నావేమిటి కొత్తగా!" అన్నాను.

సన్నగా నవ్విన ధ్వని. "కిరణ్ మీకు చెప్పాడట గదాంటీ!" అంది.

"ఏంటి చెప్పేది! వాడు చెప్పగానే అయిపోయిందా! మా నిర్ణయం ఏమిటో మేమింకా చెప్పలేదు" అన్నాను పరుషంగా.

"మీరేం నిర్ణయించుకున్నా ఇక మా పెళ్ళి ఆగదండీ. మేమా స్థాయి ఎప్పుడో దాటేశాం" అంతకన్నా పదునుగా చెప్పి ఫోన్ పెట్టేసిందమ్మాయి.

దిమ్మెరపోయాను నేను. కాసేపటిదాకా పరిసరాల స్పృహ లేదు. ఏమిటీ పిల్ల! ఏం మాట్లాడుతోంది! ఆ స్థాయి ఎప్పుడో దాటేశాం అంటే అర్థమేమిటి? ఎంత దూరం వెళ్ళారు వీళ్ళిద్దరూ!

ఆ అమ్మాయి మాటలకి అర్థం అదేనా! అయినా కాకపోయినా ఆ అమ్మాయి అలా అని చెప్పి గొడవ చేస్తే యిక తను చేయగలిగిందేమీ వుండదు. ఎవరో ఎవరో అయితే వేరు. మహిళా సంరక్షణ సమితి నడుపుతూ మహిళల కోసమే పోరాడుతున్న తను ఎలా కాదంటుంది ఆ పెళ్ళిని. వచ్చినట్లు ఒప్పుకుని తీరవలసిందే. నిస్సహాయతతో నా కళ్ళల్లోకి నీళ్ళొచ్చాయి.

ఎంత తెలివిమీరిపోయారు ఆడపిల్లలు. మగపిల్లాడికి ఆడపిల్లమీద మోజు మాత్రమే వుంటుంది. వీళ్ళకి అంతకుమించిన ప్లాన్లూ, స్ట్రాటజీలూ వున్నట్లున్నాయి.

లేకపోతే కిరణ్‌లాంటి పిల్లాడు ఒక అమ్మాయి వలలో ఇంత ఈజీగా పడటమేమిటి! ఎంతో తెలివైనవాడనుకున్న కిరణ్ ఇలాంటిపిల్లని ఎంచుకోవడమేమిటి? ప్రతి విషయాన్నీ సూక్ష్మంగా అర్థంచేసుకునే కిరణ్ ఇంత అమాయకంగా ప్రవర్తించడమేమిటి?

నేను బాధలోంచి తేరుకోకముందే సరోజ దగ్గర నుంచి ఫోన్. "రేపు ధర్నాకి అన్ని ఏర్పాట్లూ చేశాను మేడం. మనవాళ్ళందరినీ ఎనిమిది గంటలకల్లా ఆఫీస్ దగ్గరికి వచ్చేయమని చెప్పాను. పత్రికలవాళ్ళకి కూడా చెప్పేశాను.."

"సరే" అన్నాను నేను కొంచెం విసుగ్గా. మల్లీశ్వరికి సపోర్టుగా రేపు పెద్దఎత్తున ధర్నా తలపెట్టాం మేము. కానీ ఇప్పుడు ఎందుకో అది అంత ఆసక్తి కలిగించడం లేదు. బిందు ప్రవర్తన చూశాక మల్లీశ్వరి మీద యిదివరకటి సానుభూతి కలగటం లేదు. అక్కడికి వెళ్ళాలనీ...నినాదాలు చేయాలనీ, చేయించాలనీ అనిపించడం లేదు.

కానీ తప్పదు. నా మనసుకి నేనే సర్దిచెప్పుకోవాలి. అయినా కిరణ్ విషయాన్నీ, మల్లీశ్వరి విషయాన్నీ ఒకేలా చూడకూడదు.


ఇక్కడ కిరణ్‌ని పెళ్ళిచేసుకోవడం కోసం ఆ అమ్మాయి తన ఆడతనాన్ని ఎరగా వేస్తోంది. అక్కడ...అక్కడయినా అంతేగా! ప్రసాద్‌ని పెళ్ళిచేసుకోవడం కోసమేగా మల్లీశ్వరి అతనితో సంబంధం పెట్టుకున్నది.

కానీ ప్రసాద్ కిరణ్ అంత అమాయకుడు కాదు. వాణ్ని చూస్తేనే అర్థమవుతోంది. వాడిలాంటి వాటిల్లో ముదిరిపోయిన రకమని. తనేం చేస్తున్నాడో వాడికి స్పష్టంగా తెలుసు. దానిని వల్లోపడడం అనరు.

కిరణ్ నాల్రోజులు ఆ అమ్మాయితో చనువుగా తిరిగినందుకే పెళ్ళి చేసుకుంటానంటున్నాడు వాడు. ఆ ప్రసాదేమో ఆ అమ్మాయితో అన్నీ కానిచ్చుకుని పెళ్ళి చేసుకోను పొమ్మంటున్నాడు.1

మంచివాళ్ళు ఎప్పుడూ ఎదుటివాళ్ళు కూడా తమలాగే స్వచ్ఛంగా వున్నారని అనుకుంటారు.

అందుకే వాళ్ళ వలలో పడిపోతారు. కిరణ్ బిందువలలో అలాగే పడుతున్నాడు. ఆ అమ్మాయి ఎంత ప్లాన్



## ఫర్జానా పెళ్ళి?

పార్సీ భామ ఫర్జానా ఆమధ్య తెలుగులో జోరు జోరుగా కనిపించింది. సడెన్‌గా కనుమరుగైన ఈ భామ తమిళ సినిమాలకు వలస వెళ్ళిందని తెలిసింది. తాజాగా ఫర్జానా పెళ్ళి చేసుకుని అమెరికా వెళ్ళిపోయిందనే వార్త టాలీవుడ్‌లో వినిపిస్తోంది ప్పుడు. అల్లరి నరేష్‌తో కలిసి రెండు మూడు సినిమాలు చేసిన ఫర్జానా అతన్ని పెళ్ళాడబోతుందనే వార్తలు కూడా అప్పట్లో షికారు చేసాయి. అయితే ఇప్పుడు ఫర్జానా ఓ అమెరికా వాలాని పెళ్ళాడి అక్కడే సెటిలైందని చెప్పుకుంటున్నారు సినీజనాలు.

చేసుకుని యిదంతా చేస్తూందో వాడికి అర్థం కావడం లేదు.

రాత్రంతా యివే ఆలోచనలు. ఎంత సర్దిచెప్పుకున్నా మధ్య మధ్యలో ప్రసాద్‌లో కిరణ్ మొహమూ...మల్లీశ్వరిలో బిందు మొహమూ కనిపిస్తున్నాయి. కిరణ్ మీది సానుభూతి ప్రసాద్ మీదా, బిందు మీది అసహనం మల్లీశ్వరి మీదా కలుగుతున్నాయి.

నిద్ర లేచాక కూడా తలంతా భారంగా వుంది. కిరణ్ వరండాలో కూర్చుని న్యూస్ పేపర్ చూస్తున్నాడు. నేను కాఫీ కప్ చేత్తో పట్టుకుని హాల్లోని సోఫాలో కూలబడ్డాను. మరో న్యూస్ పేపర్ చేతిలోకి తీసుకుని తిరగేయసాగాను. పేపర్లో ఈ రోజు మేము చేయబోతూన్న ధర్నా గురించి ప్రముఖంగా వార్త వచ్చింది.

వున్నట్లుండి కిరణ్ పేపర్‌తోసహా వడివడిగా లోపలికి వచ్చాడు. "అమ్మా! ఏంటి ఈ రోజు మీరు ధర్నా చేస్తున్నారా ఆ అమ్మాయి కోసం!" అన్నాడు.

"అవును ఏం!" అన్నాను.

"వద్దు" అన్నాడు వాడు నేను మాట పూర్తిచేయకముందే. "నువ్వెళ్ళద్దు"

"అదేమిటి! నేను వెళ్ళకపోతే ఎలా! అసలిది తలపెట్టిందే నేనయితే!"

"అదంతా నాకు తెలీదు. నువుమాత్రం వెళ్ళద్దు. ఆ అమ్మాయి ఒళ్ళు తెలీకుండా ఎవడితోనో తిరగడమేమిటి! నువ్వెళ్ళి ఫూలిష్‌గా తనని సపోర్ట్ చేయడమేమిటి!" అన్నాడు వాడు చిరాగ్గా మొహంపెట్టి.

"కిరణ్!" అన్నాను నేను నిర్ఘాంతపోతూ.

"అవునమ్మా! ఒక్కొక్కసారి నువ్వు యింత అమాయకంగా ఎలా వుంటావో నాకసలు అర్థం కాదు. ఆ అమ్మాయేమన్నా పసిపిల్లా! పెళ్ళికిముందే వాడితో తిరగకూడదని ఆ పిల్లకి తెలీదా! తను చేసిన తప్పుకి తనే బాధ్యత తీసుకోవాలి. ఎవరి కర్మ వాళ్ళే అనుభవించాలి. అంతేకానీ ఒళ్ళు కొవ్వెక్కిన వాళ్ళందరినీ సపోర్ట్ చేస్తూ నువ్వు రోడ్డుమీద కూర్చుని ధర్నాలు చేస్తే నా ఫ్రెండ్స్ నవ్వుతారు. నువ్వెళ్ళద్దు" మరోసారి ఖచ్చితంగా చెప్పి పేపర్ టీపాయ్‌మీదికి విసిరికొట్టి వెళ్ళిపోయాడు.

నేను వూపిరితీసుకోవడం కూడా మర్చిపోయినదానిలా కూర్చుండిపోయాను.

వీడినా నేను అమాయకుడనుకున్నది. నన్నే అమాయకురాలినంటున్న వీడి గురించా నేను మోసపోతున్నాడనుకుని బాధపడింది.

ఎంత బాగా చెప్పాడు. ఎవరి కర్మ వాళ్ళనుభవించాలిట! నిజమే. ఎవరి కర్మ వాళ్ళు అనుభవించి తీరవలసిందే. అదే అందరి విషయంలో యిప్పుడు జరుగుతున్నది.

మల్లి, ప్రసాద్, కిరణ్, బిందు, నేను..అందరం ఎవరి కర్మ వాళ్ళం అనుభవిస్తున్నాం. కానీ కొత్తగా మేము తలపెడుతున్న పనులు! వాటి వెనుక మాకున్న ఆలోచనలు! పథకాలు!

పసివాడనుకున్న కిరణ్. వెకిలిపిల్ల అనుకున్న బిందు..ముగ్ధలా వుండే మల్లి. మొరటుగా కనిపించే ప్రసాద్. 'అయిందేదో అయింది. ఇక నోర్మూసుకో' అనే మల్లి వాళ్ళ నాన్న...'అంతా దాని ప్రారబ్ధం' అనే వూరి జనం. మల్లి తరఫున న్యాయపోరాటం చేయాలనుకున్న నేను. అందరికీ ఎవరి ఆలోచనలు వాళ్ళకున్నాయి. ఎవరి ఛాయిస్ ప్రకారం వాళ్ళం ఒక విషయానికి రియాక్ట్ అవుతున్నాం. మేము చేయాలనుకున్నదే చేస్తున్నాం. మాకు కావలసిన వ్యక్తులనే కాదు మేము అనుసరించే మార్గాలనీ..మేము చేస్తున్న పనులనీ మేమే ఎంచుకుంటున్నాం.

ఇందులో ఎవరు తెలివైన వాళ్ళు! ఎవరు అమాయకులు! ఎవరు ఎవర్ని విమర్శించగలరు! ఎవరు ఎవరికి దారి చూపించగలరు!

ప్రశ్నలు..లెక్కలేనన్ని ప్రశ్నలు. వాటిల్నే మననం చేసుకుంటూ చాలాసేపు కూర్చుండిపోయాను. కాసేపటికి వెల్లువెత్తిన ప్రశ్నలతోపాటు..నా వుద్వేగమూ చల్లారింది.

ఎవర్నో ఉద్ధరిస్తున్నానన్న అహంకారం అణిగిపోయింది. నేను వున్న పరిస్థితులకి కారణం ప్రారబ్ధం అయితే నేను తలపెడుతున్న పనులకి కారణం నా ఛాయిస్ అని నాకర్థమయింది.

తేటపడ్డ మనసుతో మొదలుపెట్టిన పనిని పూర్తిచేసేందుకు - నేను ధర్మం అనుకున్నదానివైపు నిలబడేందుకు బయల్దేరుతూంటే...'ఎవరి కర్మ వాళ్ళే అనుభవించాలి' అన్న కిరణ్ మాటలు గుర్తొచ్చి నా పెదవులపై చిరునవ్వు మెరిసింది.

☆

## పాపం ప్రియమణి!

తొలిసారిగా హిందీ తెరపై 'రావణ్'తో పరిచయమవుతున్న తనకి ఆ సినిమా ఎంతో మేలు చేస్తుందని ఆశలు పెట్టుకున్న ప్రియమణికి ఆ చిత్రం దారుణ పరాజయం పెద్ద షాకే. అయితే ప్రియమణి మాత్రం ఆ సినిమా జయాపజయాల గురించి బయట ఏమీ మాట్లాడడం లేదు. మరో హిందీ చిత్రం 'రక్తచరిత్ర'లోనూ ఆమె నటిస్తోంది. ఇదైనా తనకి బాలీవుడ్‌లో అదృష్టాన్ని తెచ్చిపెడుతుందని ఆశపడుతోందని ఆమె సన్నిహితుల ఉవాచ. మణిరత్నం ద్వారా దొరకని అదృష్టం రామ్‌గోపాల్ వర్మ ద్వారా లభిస్తుందేమో!

